జనం గుండెల్లో కర్నల్ సంతోష్‌బాబు

● ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 13 : దేశం కోసం ప్రాణాలు అర్పించిన కర్నల్ సంతోష్ బాబు ప్రజల గుండెల్లో చిరస్మణీయంగా నిలిచి ఉంటారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. దివంగత కర్నల్ సంతోష్‌బాబు 41వ జయంతి సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సంతోశ్‌బాబు చౌరస్తాలో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వాసవీ క్లబ్, స్ఫూర్తి క్లబ్ ఆధ్వర్యంలో ఆర్య వైశ్య కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి అల్పాహార వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికులను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదన్నారు. కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఒంటెద్దు నర్సింహారెడ్డి, మారిపెద్ది శ్రీనివాస్, సంతోశ్‌బాబు సతీమణి సంతోషి, కుమారుడు, కుమార్తె, మామ తల్లాడ వెంకటేశ్వర్ రావు, వాసవీ క్లబ్ గవర్నర్ రాచర్ల కమలాకర్, తోట శ్యామ్‌ప్రసాద్, రెడ్‌క్రాస్ చైర్మన్ ఇరిగి కోటేశ్వరి, స్ఫూర్తి క్లబ్ అధ్యక్షురాలు హైమావతి, రమాదేవి, పద్మ పాల్గొన్నారు.

బాల ఉగ్రనరసింహుడికి జేసీ వెంకట్‌రెడ్డి పూజలు

బాల ఉగ్రనరసింహుడి పూజలో పాల్గొన్న జేసీ దంపతులు

కోదాడ రూరల్, ఫిబ్రవరి 13 : మండలంలోని ఎర్రవరం దూళ్లగుట్ట బాల ఉగ్రనరసింహస్వామిని మంగళవారం అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ఆలయ పూజారి ఇనుపకుత్తికల లక్ష్మీనరసింహశాస్త్రి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దేవాలయ కమిటీ సభ్యులు జేసీ దంపతులను శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో దేవాయల కమిటీ చైర్మన్ నలజాల జనార్దన్‌రావు, డైరెక్టర్ బాలబోయిన ఉపేందర్, సభ్యులు పాల్గొన్నారు.

పరిమితులకు మించి తవ్వకాలు జరిపితే చర్యలు

● మైనింగ్ ఏడీ వెంకటరమణ

ఉండ్రుగొండలో కంకర మిల్లును పరిశీలిస్తున్న అధికారులు

చివ్వెంల, ఫిబ్రవరి 13 : కంకర మిల్లులో పరిమితులకు మించి తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని మైనింగ్ ఏడీ వెంకటరమణ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని ఉండ్రుగొండ శివారులో గల జేఎన్ రెడ్డి స్టోన్ క్రషర్ మిల్లును తనిఖీ చేసి మాట్లాడారు. ఉండ్రుగొండ, వల్లభాపురం, జగన్‌నాయక్ తండాకు చెందిన గ్రామస్తులు ఇచ్చిన పిర్యాదు మేరకు తనిఖీ చేసినట్లు చెప్పారు. నివేదికను ఉన్నతాదికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు. నివేదిక ఫలితాన్ని అనుసరించి చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగభూషణం, సీఐ అశోక్‌రెడ్డి, పొల్యూషన్ బోర్డు ఏఈఈ శంకర్‌బాబు, మైనింగ్ ఆర్ఐ కృష్ణంరాజు, తాసీల్దార్ రంగారావు, సర్వేయర్ వెంకటేశ్వర్లు,రామారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం

గరిడేపల్లి జడ్పీహెచ్ఎస్‌లో అల్పాహార పంపిణీని ప్రారంభిస్తున్న ఎంపీపీ సుజాతాశ్రీనివాస్‌గౌడ్

గరిడేపల్లి, ఫిబ్రవరి 13 : మండలంలోని కల్మల్‌చెర్వు, గరిడేపల్లి, పొనుగోడు గ్రామాల్లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు లయన్స్ క్లబ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అల్పాహార పంపిణీని మంగళవారం ఎంఈఓ చత్రూనాయక్‌తో కలిసి ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నేరేడుచర్ల అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, హెచ్ఎం నట్టె శ్రీనివాస్‌రావు, పొనుగోడు, గానుగుబండ ఇన్‌చార్జి హెచ్ఎంలు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఉపాధ్యాయుడు సుందరి కృష్ణయ్య పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థిని ఆత్మహత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరుపాలి

● ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

వైష్ణవి తల్లిదండ్రులను పరామర్శించి వివరాలు తెలుసుకుంటున్న ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 13 : ఇమాంపేట గురుకుల విద్యార్థిని వైష్ణవి ఆత్మహత్యపై సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలో వైష్ణవి కుటుంబ సభ్యులను ఐద్వా, ఎస్ఎఫ్ఐ బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైష్ణవి మృతి అనేక అనుమానాలకు తావిస్తున్నదన్నారు. ధర్నా సమయంలో ఇచ్చిన హామీల అమలుకు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే సీఎం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పందించాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్‌వర్మ, సీపీఎం పట్టణ కార్యదర్శి వి.సాయికుమార్, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు మద్దెల జ్యోతి, కోట సృజన, మామిడి సుందరయ్య, అక్కినపల్లి వినయ్, నాగరాజు, రాణమ్మ, శశి రేఖ, భిక్షమమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

వైష్ణవి కుటుంబానికి న్యాయం చేయాలి

వైష్ణవి కుటుంబాన్ని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తలమల్ల హాసేన్ పరామర్శించారు. కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా, ఒకరికి ఉద్యోగం, మూడెకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ముండ్లగిరి కాంతయ్య, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బోయిల అఖిల్, న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఏడిండ్ల అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల నర్సయ్య ఉన్నారు.

కోదాడలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి

● ఎంఈఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశ్‌ను సన్మానిస్తున్న మాదిగ ఉద్యోగుల సమాఖ్య

కోదాడ రూరల్, ఫిబ్రవరి 13 : కోదాడ పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ఎంఈఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మాదిగ ఉద్యోగ సమాఖ్య కోదాడ అధ్వర్యంలో కోదాడ ట్రాఫిక్ ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఉలవలపూడి మల్లేశ్‌కు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏపూరి పర్వతాలు, బొడ్డు హుసేన్, గంధం బుచ్చారావు, మాదాసు బాబు, బండి చినకోటయ్య పాల్గొన్నారు.

తెలంగాణ రైతాంగాన్ని ఆగం చేసేలా కాంగ్రెస్ చర్యలు

● ప్రభుత్వ తీరును నిరసించేందుకే కేసీఆర్ సభ

● సూర్యాపేటలో ఆటో డ్రైవర్ల ర్యాలీ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్ : ఆటో డ్రైవర్ల ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 13 : తెలంగాణ రైతులను ఆగం చేసేలా కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగానే నల్లగొండలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బహిరంగ సభను నిర్వహించినట్లు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్లకు జరుగుతున్న నష్టాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వివరించేందుకు ఆటో డ్రైవర్లు మంగళవారం ర్యాలీగా చలో నల్లగొండ బహిరంగ సభకు తరలివెళ్లారు. ఈ ర్యాలీని ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తమ బతుకులు ఆగమై పోతున్నట్లు ఆటో డ్రైవర్లు ఆవేదన చెందుతున్నట్లు చెప్పారు. కృష్ణా జలాలపై అసెంబ్లీలో తీర్మానం పెట్టారంటేనే ఇన్ని రోజులు చెప్పినవన్నీ అబద్దాలని తెలిపోయిందన్నారు. దృష్టి మరల్చేందుకే మేడిగడ్డకు వెళుతున్నారని, ఏ గడ్డకు పోయినా గండం నుంచి గట్టెక్కలేరన్నారు. అవగాహన రాహిత్యంతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నడిపిస్తుందన్నారు. తెలంగాణ వ్యతిరేకులంతా ఒక్కటై కేసీఆర్ మీద దాడి చేస్తున్నారని, తెలంగాణ హక్కులను కాలరాసే వారి చేతుల్లో ప్రభుత్వం కీలుబొమ్మలా మారుతుందని తెలిపారు. కాంగ్రెస్ వైఖరిని ప్రజలంతా అర్థం చేసుకోవాలని కోరారు. తమ ప్రభుత్వ పాలనలో వ్యవసాయ రంగంలో తెలంగాణ నంబర్ వన్‌గా ఉన్నట్లు వెల్లడించారు. రెండు నదుల నీళ్లను కేసీఆర్ తెలివితో రైతులకు ఉపయోగపడేలా చేశారన్నారు. బుకాయింపులు, ఎదురు దాడులు మానేసి చెంపలేసుకుని హక్కుల రక్షణకు ముందుకు రావాలని సూచించారు. కార్యకర్తలను రెచ్చగొట్టేందుకు కోమటిరెడ్డి సోదరులు చెత్త మాటలు మాట్లాడుతున్నారని, పిచ్చి పేల్రాపనలు మానాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి ఆధ్వర్యంలో తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

నేరేడుచర్ల : కృష్ణానది జలాల విషయంలో తెలంగాణ హక్కులను కేంద్రానికి దారదత్తం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న వైఖరిని నిరసిస్తూ మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భారీ బహిరంగ సభకు హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి సారథ్యంలో నియోజకవర్గంలోని రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివెళ్లారు. మధ్యాహ్నం 12 గంటల నుంచే నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల నుంచి నల్లగొండ సభకు బయల్దేరడంతో దారులన్నీ గులాబీమయం అయ్యాయి. జై కేసీఆర్.. జై కేటీఆర్.. జై సైదన్న నినాదాలను మారుమోగించారు.

బొడ్రాయిబజార్ : నల్లగొండ సభకు తరలివెళ్తున్న ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, గ్రంథాలయ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్

అర్వపల్లి : సభకు తరలివెళ్తున్న జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, నాయకులు

సూర్యాపేట రూరల్ : జడ్పీటీసీ జీడి భిక్షం ఆధ్వర్యంలో సభకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

హుజూర్‌నగర్ రూరల్ : గోపాలపురంలో జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి ఆధ్వర్యంలో సభకు తరలుతున్న బీఆర్ఎస్ నాయకులు

నేరేడుచర్ల నుంచి సభకు బయల్దేరిన మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్, డీసీసీబీ డైరెక్టర్ అప్పిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

కోదాడ రూరల్ : మాజీ ఎంపీపీ చింతా కవితారెడ్డి ఆధ్వర్యంలో చలో నల్లగొండ సభకు బస్సులో బయల్దేరిన మహిళలు

తుంగతుర్తి నుంచి తరలివెలుతున్న బీఆర్ఎస్ నాయకులు

తిరుమలగిరి : గుండెపురి గ్రామం నుంచి కేసీఆర్ సభకు తరలివెళ్తున్న ప్రజలు

నూతనకల్ మండల కేంద్రం నుంచి తరలివెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

మోతె నుంచి సభకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

పాలకవీడు : శూన్యపహాడ్ గ్రామం నుంచి సభకు తరలుతున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు


హుజూర్‌నగర్ నుంచి నల్లగొండకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

గరిడేపల్లి : లక్ష్మీపురం నుంచి నల్లగొండకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

మఠంపల్లి నుంచి కేసీఆర్ సభకు తరలుతున్న నాయకులు

నాగారం : వర్ధమానుకోట నుంచి కేసీఆర్ సభకు బయల్దేరిన బీఆర్ఎస్ నాయకులు

అనంతారం వాసికి మూడు ప్రభుత్వ కొలువులు

● లైబ్రేరియన్ డీఎల్, జేఎల్ స్టేట్ ఫస్ట్ ర్యాంక్

● పీజీటీ స్టేట్ ఫోర్త్ ర్యాంక్

రవి

తిరుమలగిరి, ఫిబ్రవరి 13 : మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం గ్రామానికి చెందిన ఉప్పలయ్య, భద్రమ్మ దంపతుల కొడుకు గడ్డం రవి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ప్రతిభ చాటాడు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో లైబ్రేరియన్ విభాగంలో డీఎల్ స్టేట్ ఫస్ట్ ర్యాంక్, జేల్‌లో సైతం స్టేట్ ఫస్ట్ ర్యాంక్ అలాగే పీజీజీ గురుకులాల్లో స్టేట్ 4వ ర్యాంక్ సాధించాడు. రవి తండ్రి గీత కార్మికుడు. రవి స్వగ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి వరకు, తిరుమలగిరి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు, అరవిందాక్ష కాలేజీ బాలెంల సూర్యాపేట నందు బీటెక్, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీఎల్ఐసీ, ఎంఎల్ఐసీ చదివాడు.

మహా శివరాత్రి జాతరను విజయవంతం చేయాలి

● హుజూర్‌నగర్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 13 : స్థానిక స్వయంభూ శంభులింగేశ్వరస్వామి ఆలయంలో మార్చి 8 నుంచి 12 వరకు జరుగనున్న మహా శివరాత్రి జాతరను విజయవంతం చేయాలని హుజూర్‌నగర్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం దేవాలయ ఆవరణలో జాతర ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే తాగునీరు, శానిటేషన్, క్యూలైన్లతో పాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పార్కింగ్‌లను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆలయ ఈఓ గుజ్జుల కొండారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొట్టె పద్మాసైదేశ్వర్‌రావు, తాసీల్దార్ జ్యోతి, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ పరమేశ్, వైస్ ఎంపీపీ గాయం గోపిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు శంభయ్య, డీఈలు వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, స్వామి, గ్రామ పెద్దలు భాస్కర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, శంభిరెడ్డి పాల్గొన్నారు.

సంతు సేవాలాల్ జయంతి వేడుకలపై సమీక్ష

హుజూర్‌నగర్ : గిరిజనుల ఆరాధ్య దైవం సంతు సేవాలాల్ జయంతి వేడుకల నిర్వహణపై మంగళవారం తాసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని గిరిజనులతో ఆర్డీఓ జగదీశ్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారికంగా సంతు సేవాలాల్ జయంతిని హుజూర్‌నగర్‌లోని టౌన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సేవాలాల్ ఉత్సవాల నూతన కమిటీ కన్వీనర్‌గా ధరావత్ నవీన్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా తేజనాయక్, కోశాధికారిగా బానోతు భాస్కర్‌ను నియమించారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

తిరుమలగిరి, ఫిబ్రవరి 13 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మున్సిపాలిటీ కేంద్రంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని మాలీపురం గ్రామానికి చెందిన జోగు ప్రసాద్ (39) స్థానిక శుభమస్తు ఫంక్షన్ హాల్ వద్ద తన స్కూటిపై రోడ్డు క్రాస్ చేస్తుండగా సూర్యాపేట నుంచి జనగామ వైపు వెళ్తున్న కారు అతి వేగంతో ఢీకొట్టడంతో తలకు బలమైన గాయమై అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఓయూ విశ్రాంత ప్రొఫెసర్‌కు కోదాడ వాసుల నివాళి

కోదాడ రూరల్, ఫిబ్రవరి 13 : ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు, కోదాడ మండలం నల్లబండగూడెం గ్రామానికి చెందిన ముండ్రా ఆదినారాయణ(80) అనారోగ్యంతో హైదరాబాద్‌లో ఆకస్మికంగా మృతి చెందారు. భౌతికకాయాన్ని మంగళవారం కోదాడ ప్రాంత వాసులు సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు అందె సత్యం, ముత్తినేని సైదేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ నలజాల శ్రీనివాస్‌రావు, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి బొల్లు రాంబాబు, ఎస్ఆర్‌కే మూర్తి, ముండ్రా రంగారావు, సీతయ్య, బసవయ్య, డీఎన్ స్వామి పాల్గొన్నారు.

గీత కార్మికుడిపై కత్తితో దాడి

ఆత్మకూర్.ఎస్, ఫిబ్రవరి 13 : తాటిచెక్కు ఎక్కి వస్తున్న గీత కార్మికుడిపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన మండలంలోని తుమ్మలపెన్‌పహాడ్‌లో మంగళవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుమ్మలపెన్‌పహాడ్‌కు చెందిన కాట్ల సందీప్ (25) కల్లు తీసేందుకు వెళ్లాడు. చెట్లు ఎక్కి వస్తుండగా అదే గ్రామానికి చెందిన ఎరగాని లింగయ్య కల్లు గీసే కత్తితో సందీప్‌పై దాడి చేశాడు. ఈ దాడిలో సందీప్ మెడ, వీపుపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే చికిత్స కోసం సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. ఇరువురి మధ్య కొంతకాలంగా కుటుంబ వివాదాలు ఉన్నాయని, పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయతీలు జరిగినట్లు తెలిపారు. బాధితుడి సోదరుడు కాట్ల లింగయ్య ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.